సాక్షి తిరుపతి

గురువారం । 5 । సెప్టెంబర్ । 2024



రైల్వే స్టేషన్ భద్రతపై సమీక్ష

తిరుపతి (అలిపిరి): తిరుపతి రైల్వే స్టేషన్ భద్రతపై బుధవారం సమీక్షించారు. ఏఎస్పీ రవిమనోహరాచారి పాల్గొన్నారు.



శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. టైంస్లాట్ టికెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది.

రేపు సత్యవేడులో జాబ్‌మేళా

నారాయణవనం: సత్యవేడు పాలిటెక్నిక్‌లో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ జిల్లా అధికారి లోకనాథం తెలిపారు. బుధవారం ఈ మేరకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో కలిసి జాబ్ మేళా పోస్టర్ విడుదల చేశారు. లోకనాథం మాట్లాడుతూ ఆసక్తిగల వారు https://shortur.at/if7XT లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాకాల: మండల కేంద్రంలోని 132కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ నరేంద్ర తెలిపారు. మరమ్మతులు చేయనున్న దృష్ట్యా అంతరాయం ఉంటుందని చెప్పారు.

13 నుంచి ఆర్‌ఎస్‌యూ జాతీయ మహాసభలు



తిరుపతి కల్చరల్: ఎస్వీ యూనివర్సిటీలో ఈనెల 13 నుంచి మూడు రోజులు నిర్వహించనున్న ఆర్‌ఎస్‌యూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. అన్నమయ్య సర్కిల్‌లోని ఆర్‌ఎస్‌యూ కార్యాలయంలో జాతీయ మహాసభల లోగోను ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్‌ఎస్‌యూ జిల్లా నేతలు పాల్గొన్నారు.

నియామకం



మల్లిఖార్జున్

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు సేవా సమితి తిరుపతి నియోజకవర్గం కన్వీనర్‌గా చింతంశెట్టి మల్లిఖార్జున్‌ను నియమిస్తూ ఏపీ రాష్ట్ర కాపునాడు జాతీయ అధ్యక్షుడు మల్లెల శివనాగేశ్వరరావు నియామక పత్రం పంపారు.

16 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : మందు కొట్టి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న 16 మందికి 1.60లక్షలు జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీ చేసి మందుబాబులపై కేసులు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరిచారు.

గురుభ్యోనమః



సమాజానికి ఉత్తమ పౌరులను అందించే పూజనీయులు.. దేశ అభ్యున్నతికి దిశానిర్దేశం చేసే ఆదర్శనీయులు.. పిల్లలకు చదువుతో పాటు సంస్కారం నేర్పించే మాననీయులు.. మన సంస్కృతిలో తల్లిదండ్రుల తర్వాత సమున్నత స్థానం గురువుకే దక్కింది. నిస్వార్థంగా విధులు నిర్వర్తిస్తూ విద్యార్థుల భవితకు బంగారుబాటలు వేసే ఉపాధ్యాయులను గౌరవించుకోవడం అందరి బాధ్యత. ఎందరికో విద్యాబుద్ధులు నేర్పి భరతమాతకు ముద్దుబిడ్డలను అందించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజున గురుపూజోత్సవం జరుపుకోవడం జాతికి గర్వకారణం. ఈ సందర్భంగా విద్యార్థుల ఉన్నతి పాటుపడిన ఉత్తమ ఉపాధ్యాయుల సేవలను స్మరించుకోవడం మన కర్తవ్యం.

– తిరుపతి ఎడ్యుకేషన్

- ఉపాధ్యాయులు.. ఉత్తమ సమాజ సృష్టికర్తలు
- విద్యార్థుల ఉన్నత భవితకు మార్గదర్శకులు
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

అభినయంతో బోధన



ఆమూరి సుబ్రమణ్యం, ఉపాధ్యాయుడు, జెడ్పీ హైస్కూల్, కరకంబాడి

కరకంబాడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న ఆమూరి సుబ్రమణ్యం తన నటనా కౌశలంతో రాష్ట్రస్థాయి బహుమతులు సాధించారు. అదే ప్రతిభను తరగతి లోనూ చూపుతూ అభినయంతో చరిత్ర పాఠాలను వివరిస్తూ విద్యార్థులను ఆకట్టుకుంటున్నారు. 1984లో ఆయన ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. 2005లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందారు. అక్షర తపస్మాన్ కార్యక్రమంలో మూడేళ్లపాటు కల్చరల్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తూ వయోజన విద్య, పరిశుభ్రత, ఎయిడ్స్, సాంఘిక దురాచారాలపై నాటకాలు, పాటలు రాసి ప్రదర్శించారు. 2012లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు.

నైపుణ్యాలకు మెరుగుపెడుతూ..



2019లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఉషారాణి (ఫైల్)

సెకండరీ గ్రేడ్ టీచర్‌గా 1997లో డి.ఉషారాణి ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెట్టారు. అప్పటి నుంచి పలు పాఠశాలల్లో పనిచేస్తూ వచ్చారు. కేవలం చదువు ఒక్కటే విద్యార్థులకు సరిపోదని గ్రహించి వారిలో నైపుణ్యాలకు మెరుగుపెట్టేవారు. ముఖ్యంగా ఆటలు, పాటలు, నృత్యం, చిత్రలేఖనం వంటి విభిన్న కళల్లో మెలకువలు నేర్పి పిల్లను బహుముఖ ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. గిరిజన విద్యార్థులకు విద్యాసామగ్రిని సమకూరుస్తూ తనవంతు సాయం అందిస్తున్నారు. 2021లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ప్రస్తుతం చంద్రగిరి మండలం, తొండవాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. 2019లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందుకున్నారు.

పోటీ ప్రపంచంలో దీటుగా..



సి.భాగ్యశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, జెడ్పీహైస్కూల్, కరకంబాడి

ఆంగ్ల ఉపాధ్యాయుడిగా 2001లో సి.భాగ్యశేఖర్‌రెడ్డి ప్రస్థానం ప్రారంభించారు. విద్యార్థులను పోటీ ప్రపంచంలో దీటుగా నిలబెట్టేందుకు తన వంతు కృషి చేస్తున్నారు. 2002లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందారు. 2010లో చిత్తూరు జిల్లా ఇంగ్లిష్ మొబైల్ టీమ్‌కు కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. పాఠ్యపుస్తక రచయితగా, టీచర్ ట్రెనింగ్ మాడ్యూల్ రూపకర్తగా, స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం కరకంబాడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ పనిచేస్తున్నారు. ఇటు విద్యార్థులు, అటు విద్యారంగ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ఆయన 2014లో జిల్లా స్థాయి, 2016లో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు.

వినూత్నంగా బోధన



పి.నీలకంఠయ్య, ఉపాధ్యాయుడు, జెడ్పీ హైస్కూల్, కరకంబాడి

ఉపాధ్యాయ వృత్తిలోకి నీలకంఠయ్య 1995లో అడుగు పెట్టారు. 2006లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా ఉద్యోగోన్నతి పొందారు. రాష్ట్ర స్థాయిలో పాఠ్యపుస్తక, ఉపాధ్యాయ కరదీపిక రచనల్లోనూ, ప్రశ్నపత్రాల రూపకల్పనలోనూ తన వంతు పాత్ర పోషించారు. ఐఎఫ్‌పీ ద్వారా విద్యార్థులకు అర్థమయ్యేలా చిత్రాలతో వినూత్నంగా పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. 2019లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్నారు. అలాగే 2022లో అవార్డును అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. 2008లో ఉత్తమ కో-ఆర్డినేటర్ అవార్డును అందుకున్నారు.

నేడు అవార్డుల ప్రదానం

తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో గురువారం ఉదయం 9 గంటలకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించనున్నట్లు డీఈఓ శేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 68మందికి అవార్డులు అందజేయనున్నట్లు వెల్లడించారు.

పిల్లలను ప్రోత్సహిస్తూ..



శ్రీరాములు, ఉపాధ్యాయుడు, జెడ్పీ హైస్కూల్, నెలబల్లి

శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన శ్రీరాములు 1996లో ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. 2009లో ఉద్యోగోన్నతి పొందారు. ప్రస్తుతం నెలబల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. అత్యధిక సమయం పాఠశాలలోనే ఉంటూ విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. మంచి మార్కులు సాధించిన పిల్లలకు ఏటా రూ.50వేల సొంత నగదును బహుమతుల రూపంలో అందించి ప్రోత్సహిస్తుంటారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమించే శ్రీరాములు ఎప్పుడూ అవార్డులకు దూరంగా ఉంటారు. అధికారులు ఎంత ఒత్తిడి చేసినా సున్నితంగా తిరస్కరిస్తుంటారు.

9 లోపు పీజీ అడ్మిషన్లు పొందాలి

తిరుపతి సిటీ: పీజీ సెట్-2024లో భాగంగా ఎస్వీయూలో పలు పీజీ కోర్సుల్లో సీట్లు సాధించిన విద్యార్థులు ఈ నెల 9వ తేదీలోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరై అడ్మిషన్ పొందాలని రిజిస్ట్రార్ భూపతినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సీటు పొందిన వారు కార్యాలయ పనిదినాల్లో వర్సిటీలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయం వద్దకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలలోపు హాజరుకావాలని కోరారు.

చిరుధాన్యాల ఉత్పత్తుల మేళా ప్రారంభం



మేళాను పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

తిరుపతి కల్చరల్: రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, ఫార్మర్ టూ కనెక్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రాస్‌లో చిరుధాన్యాల ఉత్పత్తులు, సేంద్రియ ఉత్పత్తుల మేళాను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా సీబీఐ విశ్రాంత సంయుక్త సంచాలకుడు టీవీ.లక్ష్మీనారాయణ మేళాను సందర్శించి మాట్లాడారు. రాస్ విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో సొమ్ము చెల్లించకపోతే జైలు

తిరుపతి లీగల్ : చెక్ బౌన్స్ కేసులో ఫిర్యాదిదారుడికి నెల లోపు రూ.14.20లక్షలు చెల్లించాలని, లేనిపక్షంలో ఏడాది జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తిరుపతి ఆరవ అదనపు జూనియర్ జడ్జి రానా ప్రతాప్ బుధవారం తీర్పు చెప్పారు.వివరాలు.. తిరుపతి, తుమ్మలగుంట రోడ్డుకు చెందిన పూర్ణచంద్రారెడ్డి తన వ్యాపారం కోసం తిరుపతి శ్రీనివాసపురానికి చెందిన కె.వెంకట రవిచంద్ర వద్ద 2015 జనవరిలో రూ.13 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి అతను 2017డిసెంబర్‌లో రూ.10లక్షల చెక్కును రుణదాతకు ఇచ్చాడు. అయితే ఆ చెక్కు బ్యాంకులో బౌన్స్ కావడంతో పూర్ణ చంద్రారెడ్డిపై రుణదాత చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

ఉపాధ్యాయులు ఆదర్శనీయులు

–డీవైఈఓ బాలాజీ



అవార్డులు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు

తిరుపతి కల్చరల్: నేటి బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దుతూ సమాజ శ్రేయస్సుకు దోహదపడుతున్న ఉపాధ్యాయులు ఆదర్శనీయులని డీవైఈఓ కె.బాలాజీ అన్నారు. ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ,రేవతి ఫౌండేషన్ సంయుక్తంగా న్యూ బాలాజీ కాలనీలోని మేక్‌మై బేబీ జీనియస్ స్కూల్లో బుధవారం ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించాయి. ముఖ్య అతిథిగా డీవైఈఓతోపాటు మరో అతిథి గురుకుల విద్యాలయ ప్రిన్సిపల్ డాక్టర్ సి.నారాయణస్వామి మాట్లాడారు. అబ్దుల్ కలాం వంటి గొప్ప వ్యక్తి కూడా రాష్ట్రపతి పదవి కన్నా ఉపాధ్యాయ వృత్తి గొప్పదని కొనియాడారన్నారు. ఉపాధ్యాయ వృత్తికి మించినది ఏదీ లేదన్నారు. ట్రస్ట్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ తహసున్నీసా బేగం మాట్లాడుతూ, సమాజ హితం కోరే వ్యక్తి గురువని, గురుపూజోత్సవం పురస్కరించుకుని 42 మందికి ఉత్తమ టీచర్లు అవార్డులు ప్రదానం చేసి సత్కరిస్తున్నట్లు చెప్పారు. మేక్ మై బేబీ జీనియస్ స్కూల్ డైరెక్టర్ ఎస్.భాస్కర్ రాజు, ప్రసన్న భారతి విద్యాసంస్థల అధినేత కె.ఈశ్వరయ్య, వెలోసిటీ నీట్ అండ్ ఐఐటీ అకాడమీ డైరెక్టర్ జి.వీరశేఖర సి.మహమ్మద్ ఖాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ టీచర్లు వీరే!



సుగుణ, రమేష్ యాదవ్, జి.తారకనాథ్

రామచంద్రాపురం: మండలంలోని ఎన్ఆర్ కమ్మపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన సుగుణ, పరమాల ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్ రమేష్ యాదవ్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయవేలు తెలిపారు.

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం చినిగేపల్లె పాఠశాలకు చెందిన జి. తారకనాథ్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున అవార్డు అందుకోనున్నారు.

కులగణన కోసం ఉద్యమిద్దాం

తిరుపతి కల్చరల్: కులగణన కోసం బీసీ కులాలు ఐక్యంగా ఉద్యమించాలని బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి వందనకుమార్ పిలుపునిచ్చారు. బుధవారం బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో బీసీల సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కులగణన చేయడానికి మనువాద బీజేపీ, ఎన్‌డీయే భాగస్వామ్య పక్షాలు ముందుకు రావడం లేదని, తమ పార్టీ మాత్రమే కులగణన సాధన కోసం ఉద్యమిస్తోందన్నారు. రిజర్వేషన్ల ప్రక్రియలో బీసీ కులాలకు అన్యాయం జరుగుతోందని గణాంకాలతో సహా ఆయన వివరించారు. బీఎస్పీ జోనల్ కో-ఆర్డినేటర్ పెనుమూరు గుర్రప్ప, పార్టీ నేతలు విజయక్‌కుమార్, వేణుగోపాల్‌రాజు, సుధాకర్, ఆర్.పరశురాం, సుబ్రమణ్యం, బీసీ కులాల ఐక్య వేదిక నేతలు రవికుమార్, చాంద్‌బాషా, భాస్కర్ గౌడ్, మస్తాన్, అంకమ్మ, వివిధ నియోజకవర్గాల నేతలు పాల్గొన్నారు.

తిరుపతికి తలమానికం

- రూ.300 కోట్లతో రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు
- గత ప్రభుత్వ కృషి ఫలితమే నిధులు
- ఎంపీ గురుమూర్తి



తిరుపతి రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీ గురుమూర్తి

సాక్షి ప్రతినిధి, తిరుపతి : తిరుపతికి తలమానికంగా రైల్వేస్టేషన్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నట్లు ఎంపీ గురుమూర్తి తెలిపారు. బుధవారం స్టేషన్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం రైల్వేస్టేషన్ డైరెక్టర్, ఇంజినీరింగ్ అధికారులతో పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా రైల్వే అండర్ బ్రిడ్జిలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల గురించి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎంపీ మాట్లాడుతూ తిరుపతి రైల్వే స్టేషన్ మీదుగా ఏటా సుమారు 6 కోట్ల మంది ప్రయాణిస్తున్నారన్నారు. ఈ మేరకు అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.300 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. ఇందుకోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేశారని చెప్పారు. ఆయన ఆదేశాల మేరకే కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం నిధులు సాధించామని వివరించారు. గత ప్రభుత్వ హయాంలోనే పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ రైల్వే స్టేషన్ నిర్మాణం తిరుపతి నగరానికి తలమానికంగా మారుతుందన్నారు. సీఆర్ఎస్ లెవెల్ క్రాసింగ్ 109 వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఇప్పటికే మొదలయ్యాయని, కాటన్ మిల్లు , హీరోహోండా షోరూమ్ వద్ద అండర్ బ్రిడ్జిల నిర్మాణం కోసం కేబుల్ షిఫ్టింగ్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. వర్షాకాలం నేపథ్యంలో రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.

ముగ్గురు సీఐల బదిలీ

తిరుపతి క్రైమ్ : జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుమల టూ టౌన్ సీఐ సత్యనారాయణను వీఆర్‌కు బదిలీ చేసి ఆయన స్థానంలో ఎస్వీ యూనివర్సిటీ సీఐ మురళీ మోహన్‌ను నియమించారు. యూనివర్సిటీ సీఐగా చంద్రగిరి సీఐ రామయ్య, చంద్రగిరి స్టేషన్‌కు సుబ్బరామిరెడ్డి బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బాలికతో అసభ్యప్రవర్తన

తిరుపతి రూరల్ : వైద్యం పేరిట బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపారు. వివరాలు.. తిరుపతి రూరల్ మండలం లింగేశ్వరనగర్‌కు చెందిన వ్యక్తికి ఇద్దరు పిల్లలు. ఆరో తరగతి చదువుతున్న 10 ఏళ్ల కుమార్తె బుధవారం మధ్యాహ్నం దగ్గరలోని మహి మెడికల్ షాపు వద్దకు వెళ్లింది. దుకాణ యాజమాని కుప్పుస్వామి ట్రీట్‌మెంట్ చేస్తున్నట్లు నటించి బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక ఏడుస్తూ ఇంటికి వెళ్లి తండ్రికి చెప్పింది. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

వరద ముంపులో సదరన్ డిస్కమ్ సేవలు



విజయవాడలో వరద ముంపు ప్రాంతాల్లో ఎస్పీడీసీఎల్ సిబ్బంది

తిరుపతి రూరల్: భారీ వర్షాల కారణంగా విజయవాడలో అతలాకుతలమైన విద్యుత్ వ్యవస్థను సరిదిద్దేందుకు సదరన్ డిస్కమ్ సిబ్బంది రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష రావు ఆధ్వర్యంలో తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు సర్కిళ్ల నుంచి 810 మంది అధికారులు, సిబ్బంది 65 బృందాలుగా విజయవాడకు తరలివెళ్లారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేస్తున్నారు.

కూరగాయల తోటల్లో తెగుళ్ల ఉధృతి

చంద్రగిరి: వర్షాల కారణంగా కూరగాయల తోటల్లో తెగుళ్లు ఆశిస్తాయని, ముందు జాగ్రత్తలు తీసుకుంటే వీటిని అరికట్టవచ్చునని మండల ఉద్యాన అధికారిణి శైలజ అన్నారు. బుధవారం ఆమె దోర్నకంబాల పంచాయితీలోని కూరగాయ తోటలను పరిశీలించి మాట్లాడారు. కూరగాయల తోటలలో ఆకు మచ్చ తెగులు, బూజు తెగులు, కాయకుళ్లు తెగుళ్ల ఉధృతి అధికంగా ఉంటోందని ఆమె చెప్పారు. వీటి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. రైతులు కూరగాయలు, పూల తోటలను డ్రిప్ పద్ధతిలో సాగు చేస్తే సాధారణ దిగుబడి కంటే 35 నుంచి 40 శాతం అధిక దిగుబడి పొందవచ్చని, డ్రిప్ ఇరిగేషన్ కోసం దరఖాస్తు చేసేందుకు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మైక్రో ఇరిగేషన్ ఏరియా అధికారి తులసి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

22 నుంచి 'శ్రీవారాహి మహా రథయాత్ర'

తిరుపతి కల్చరల్: తిరుచానూరులోని శ్రీ ఆది వారాహి శక్తి టెంపుల్ ట్రస్ట్, వేలూరులోని త్రిశక్తి వారాహి పీఠం సంయుక్త ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా మహారథయాత్ర నిర్వహించనున్నట్లు శ్రీఆదివారాహి శక్తి టెంపుల్ ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు మబ్బు దేవానారాయనరెడ్డి, అధ్యక్షుడు మహారుద్ర వారాహి స్వామి తెలిపారు. ఇందుకు సంబంధించి బుధవారం ప్రెస్‌క్లబ్‌లో రథయాత్ర పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. తిరుపతిలో యాత్ర ప్రారంభమై విశాఖపట్నంలో ముగుస్తుందని యాత్ర వివరాలను వివరించారు. ట్రస్ట్ కార్యదర్శి జి.సుబ్రమణ్యం, పీఆర్ఓ శివకుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీరంగం పాల్గొన్నారు.

దళితుడి భూమి ఇప్పించండి మహాప్రభో..

భాకరాపేట : దళితుడి భూమి దళితునికే ఇప్పించాలని ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరదరాజుల మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం చిన్నగొట్టిగల్లు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద దళితులు ఆందోళన చేశారు. ఎగవూరు పంచాయతీ ముదుగుండ్లమాదిగపల్లె వాసి ఆర్.జ్యోతికి చెందిన సర్వే నంబరు 7/3 లో 1.70 సెంట్లు భూమిని మూడు తరలాలుగా అనుభవిస్తున్నా అదే గ్రామానికి చెందిన అగ్రకుల పెద్దలు ఆ భూమిలోకి ప్రవేశించి జ్యోతిని వేధిస్తున్నారని, ఈ వేధింపులు భరించలేకనే జ్యోతి భర్త ఎర్రయ్య మానసికంగా కుంగిపోయి చనిపోయారంటూ పైవిధంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు గురుశంకరప్రసాద్, రమేష్‌మాదిగ, ఆదినారాయణ, రాంబాబుమాదిగ, గోపాలయ్య, నాగరాజ, పరంధామయ్య, జ్యోతి, నాగులయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తిరుపతి డీసీఎల్‌గా ఓంకారరావు



తిరుపతి రూరల్: తిరుపతి జిల్లా ఇన్‌చార్జ్ ఉప కార్మిక కమిషనర్‌గా ఓంకారరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు సహాయ కార్మికశాఖ కమిషనర్‌గా ఉన్న ఆయనకు తిరుపతి జిల్లా డీసీఎల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు మదనపల్లి సహాయ కమిషనర్ రంగరాజు ఇన్‌చార్జ్‌గా ఉండేవారు.

ఈఎస్‌ఐ వైద్య శిబిరం

తిరుపతి తుడా: స్థానిక ఓ ప్రైవేటు హోటల్ కార్మికులు, సిబ్బందికి ఈఎస్‌ఐ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బాలాజీ, సంతోష్‌నాయక్, చందన, ఉపేంద్రకుమార్, ఆస్టిన్‌రాజు, సరస్వతమ్మ, హేమలత, ప్రేమ, శ్రీకాంత్ తదితులు పాల్గొన్నారు

సీఐగా సుబ్బరామిరెడ్డి



చంద్రగిరి: చంద్రగిరి సీఐగా సుబ్బరామిరెడ్డి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రామయ్య తిరుపతి యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. గతంలో నగరి రూరల్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న సుబ్బరామిరెడ్డి, ఎన్నికల నేపథ్యంలో బదిలీ అయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు.

అబాకస్‌లో ప్రతిభ



అవార్డు అందుకుంటున్న దర్శన్

తిరుపతి ఎడ్యుకేషన్: యూసీఎంఏఎస్ అబాకస్ సంస్థ ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి విజువల్ కాంపిటీషన్‌లో తిరుపతి బాలాజీకాలనీలోని శ్రీవేంకటేశ్వర యూసీఎంఏఎస్ అబాకస్ విద్యార్థులు టి.దర్శన్, బి.పవన్ జైరామ్, ఎం.హర్షిత, జి.సౌర్య సాయిరెడ్డి ప్రతిభ చాటారు. అలాగే గుంటూరులో నిర్వహించిన లిజనింగ్ కాంపిటీషన్‌లో టి.దర్శన్ చాంపియన్ అవార్డు, అలాగే ఫ్లాష్ కాంపిటీషన్‌లో తృతీయ రన్నరప్ అవార్డును అందుకున్నాడు.

లైట్లు వేశారోచ్..!



లైట్లు వేశాక ఇలా..

చంద్రగిరి: స్థానిక కొత్తపేటలోని సచివాలయంలో ఎట్టకేలకు చీకట్లు తొలగిపోయాయి. బుధవారం సాక్షి దినపత్రికలో 'చిమ్మ చీకట్లో విధులు..!' శీర్షికతో సచివాలయం అంధకారంలో మగ్గుతున్న వైనాన్ని ప్రచురించింది. దీనిపై అధికారులు స్పందించారు. లైట్లను ఏర్పాటు చేశారు. దీంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

పకడ్బందీగా 'చవితి' ఏర్పాట్లు



వినాయక చవితి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి

తిరుపతి తుడా: వినాయక చవితి వేడుకలకు ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని మున్సిపాలిటీ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య అధికారులను ఆదేశించారు. వరసిద్ధి వినాయక ఉత్సవ నిర్వహణ, ఏర్పాట్లపై బుధవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ హాల్‌లో వినాయక మహోత్సవ కమిటీ నిర్వాహకులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. చవితి ఉత్సవాలు నిర్వహించే ప్రాంతాల్లో చేయవలసిన ఏర్పాట్లు, కల్పించవలసిన వైద్య సదుపాయాలు, భద్రత, అగ్నిప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుధ్యం..ఇత్యాది అంశాలపై సమీక్షించారు. మట్టి గణపతిని పూజిస్తాం..పర్యావరణాన్ని కాపాడుదాం.. అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, ఆర్డీఓ నిశాంత్ రెడ్డి, డీఎస్పీ రామకృష్ణ ఆచారి, డీఈ విజయకుమార్ రెడ్డి, వినాయక మహోత్సవ కమిటీ ప్రతినిధులు, జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసులు, ట్రాన్స్‌కో డీఈ వాసురెడ్డి, రవీంద్రారెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్యాలే ప్రధాన భూమిక



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, అసోసియేషన్ సభ్యులు

తిరుపతి సిటీ: ఉపాధి, ఉద్యోగాల సాధనలో నైపుణ్యాలే ప్రధాన భూమిక అని, పోటీ ప్రపంచంలో విద్యార్థినులు దీనిపై దృష్టి సారించి పెంపొందించుకోవాలని ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్వీఎస్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ ఈసీఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటెక్ (ఇన్‌క్రెడిబుల్ టెక్నోక్రాట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్) ముఖ్యఅతిథిగా సత్యనారాయణ మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ మల్లికార్జున, ఈసీఈ అసోసియేషన్ సభ్యులు మాధవి, ప్రశాంతి, సంకీర్తన పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో వెబినార్

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ గురువారం పోస్టరింగ్ ఇన్నోవేషన్ త్రూ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ అనే అంశంపై వెబినార్ నిర్వహించింది. హర్యానా సోంపేటకు చెందిన బీపీఎస్ ఉమెన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రమోద్ మాలిక్ ముఖ్య వక్తగా.. పేటెంట్ ఫైలింగ్, కాపీ రైట్స్, ట్రేడ్ మార్క్, పేటెంట్ వ్యాలిడిటీ, ప్రాపర్టీ అంశాలపై ప్రసంగించారు. వర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్ ఉష, డాక్టర్ సుష్మ, కిషోరి, శిరీష, ఇందిర, విజయ, మాధవి, రమేష్ పాల్గొన్నారు.

సమాజాన్ని మార్చే శక్తి సాహిత్యానిదే



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వీసీ డాక్టర్ అప్పారావు

తిరుపతి సిటీ: సమాజాన్ని మార్చే శక్తి సాహిత్యానికి ఉందని ఎస్వీయూ వీసీ డాక్టర్ సీహెచ్ అప్పారావు అన్నారు. బుధవారం ఎస్వీయూ తెలుగు విభాగం, ఓఆర్‌ఐ సంయుక్త ఆధ్వర్యంలో 'యద్దనపూడి సులోచనారాణి సాహిత్య వివేచన' పుస్తక పరిచయ సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్వీయూ వీసీ మాట్లాడారు. తెలుగు సమాజాన్ని అత్యంత ప్రభావితం చేసిన రచయిత్రి యద్దన పూడి సులోచనారాణి అని కీర్తించారు. ఓ తరం స్త్రీలను తన సాహిత్యంతో ఆలోచింపచేసిన గొప్పవ్యక్తి యద్దనపూడి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ పద్మనాభం, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, ఆకాశవాణి మాజీ సంచాలకులు వేణుగోపాల్, రిజిస్ట్రార్ భూపతినాయుడు, తెలుగు విభాగాధిపతి రాజేశ్వరమ్మ, ఓఆర్‌ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.